డా॥ ముక్తేవి భారతి



# పాల్కురికి సోమనాధుడు

పాల్కురికి సోమనాధుడు సంస్కృతాంధ్ర కర్ణాటక భాషాపండితుడు. వీరశైవుడు. శైవమత ప్రచారమే సోమన రచనలకి మూలం. సోమనాధుడు శివుని ప్రమధ గణములలో ఒకడైన భృంగి అవతారమని శివభక్తుల విశ్వాసము.

శివకవి యుగమే ఒక ప్రత్యేకతను సంతరించుకుని, భాషలో, ఛందస్సులో, భావంలో అన్నిటా దేశీయతను పెంచి పోషించింది. పాల్కురికి సోమన వీరశైవ కవులలో అగ్రేసరుడు. సంస్కృతంలో, కన్నడంలో, తెలుగులో కృతులు రచించాడు. మొత్తం ముప్పయిదాకా సోమన రచనలున్నాయని తెలుస్తోంది. సోమనాధుని పద్ధతి చూస్తే అన్నిటా నవ్యత కోరుతున్నట్టనిపిస్తుంది. వస్తువును ఎన్నుకోవటంలో కేవలం దేశీయమైన శివకథలనే ఎన్నుకొన్నాడు. శైవ మత స్థాపకుడైన బసవేశ్వరుని జీవితం కథావస్తువై బసవపురాణం వెలువడింది.

తెలుగులో సోమనాధుడు రచించిన కృతులలో అనుభవసారము, వృషాధిప శతకము, చతుర్వేద సారము, చెన్నమల్లు సీసములు పద్య రచనలుగా పేరొందాయి.

అనుభవసారము అనేది విశేషమైన వృత్తాలతో కేవలం గురు భక్తి మహిమ, శివపూజా పద్ధతి మొదలైన వాటితో కూడి వుంది.

సోమనాధుని వృషాధిప శతకము ప్రసిద్ధమైంది. శతక లక్షణాలన్నీ కలిగిన తెలుగులో వున్న మొదటి శతకమిది. ఈ శతకం అంతా శివభక్తుల చరిత్రలు, శివపరమైన స్తోత్రములతో శివమయంగా కనిపిస్తుంది. చంపక, ఉత్పలమాల వృత్తాలున్నాయి ఈ శతకంలో. ఈ శతక పద్య రచనే, శివభక్తి పారవశ్యంలో ముంచేస్తుంది.

ఉ॥ అక్షయ భక్తి పక్ష, బసవాక్షర పాఠక కల్పవృక్ష,రు
ద్రాక్ష విభూతి పక్ష, ఫలితార్థ ముముక్ష, శివప్రయుక్తి ఫా
లాక్ష, కృపాసమంచిత కటాక్ష, శుభాశుభపాశమోక్ష,త
త్త్వక్షమ, నీవె దిక్కు, బసవా, బసవా, బసవా, వృషాధిపా॥

ఈ శతకము భక్తి భావంలో రసస్ఫూర్తితో తరువాతి కాలం నాటి శతక కర్తలకెందరికో దారి చూపినదైంది.

పద్యకృతులే కాక, కొన్ని లఘుకృతులు కూడా సోమన రచించాడు. ఇవన్నీ స్తుతిపరమైనవి. గద్యాలుగా పంచప్రకారగద్య, అష్టోత్తర శతనామగద్య మొదలైనవి సోమన రచించి, విలక్షణమైన గద్య రచనను ప్రచారం చేశాడు.

గద్యలు కాక రగడలు రచించాడు. సోమన చాలా రగడలు రచించాడనినా, బసవరగడ మాత్రమే లభిస్తోంది. ఇది 'శరణు బసవ' అనే మకుటంతో వుంది. సోమన తెలుగులో బసవోదాహరణ అని ఉదాహరణ ప్రక్రియను రచించాడు. బసవోదాహరణలో బసవేశ్వరుని మహిమలే స్తుతింపబడ్డాయి.

పాల్కురికి సోమనాధునికి శాశ్వతమైన పేరు ప్రఖ్యాతులు ఆర్జించి పెట్టిన గొప్ప రచన బసవపురాణం. దేశి పద్ధతిలో స్వతంత్రమైన వీరశైవపురాణంగా, ఏడు ఆశ్వాసాలతో వెలసిన ద్విపద కావ్యం. బసవేశ్వరుని చరిత్ర ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని, భక్తుల కథలు కలుపుకుంటూ, సోమన వీరశైవ భక్త్యావేశంతో రచించిన బసవపురాణం సాహిత్య చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని పొందింది.

"అతత బసవపురాతన భక్త
గీతార్థ సమితయే మాతృకగాగ
బూరితంబై యొప్పు బూసలలోన
దారంబు ఆయ బురాతన భక్త వితతి
చరితల లోపల సంధిల్ల బసవచరితమే
వర్ణింతు సత్కృతియనగ"

నిజానికి బసవడు క్రీ.శ 1162లో చాళుక్య రాజ్యాన్ని పాలించిన బిజ్జలుని మంత్రి దండనాధుడు. బసవేశ్వరునిపై గల భక్తి ప్రపత్తులే బసవపురాణ రచనకు దారి తీసాయి.

బెజ్జమహాదేవి, మడివాలు మాచయ్య, కిన్నెర బ్రహ్మయ్య, శివనాగుమయ్య, ఉడుమూరి కన్నప్ప, మొదలైన భక్తుల కథల్లో భక్తి రసావిర్భవం చేశాడు పాల్కురికి సోమన. బసవపురాణము తెలుగులో దేశీపురాణం. అంతేకాక స్వతంత్రపురాణం. ఇంతేకాక, కథల వంకని ఆనాటి సాంఘిక స్థితిగతులు కూడా అద్దం పట్టాయి బసవపురాణంలో.

పాల్కురికి సోమన ఏది రచించినా శివభక్తి ప్రచారమే లక్ష్యం కనుక శివాంశ సంభూతుడైన పండితారాధ్యుని చరిత్రను 'పండితారాధ్య చరిత్ర' గా రచించి ఇందులో మరి కొన్ని భక్తుల కథలు చేర్చాడు. పండితారాధ్య చరిత్ర ద్విపదలో రచింపబడి, పాల్కురికి సోమన పాండితీ వైభవాన్ని, లోకానుభవాన్ని కూడా చూపిస్తోంది. పండితారాధ్య చరిత్రలో వున్న అనేకానేక సంగీత, నాట్య, వైద్య, ఇత్యాది విషయాల వల్ల ఆ గ్రంథాన్ని "తొలి విజ్ఞాన సర్వస్వం"గా కూడా కొందరు ప్రశంసించారు.

❀




